క్లుప్తంగా

మార్కెట్ ఆదాయానికి గండి

చర్ల: వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయానికి గండి పడేలా ఉద్యోగులు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. చర్ల (నూగూరు) వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని తేగడ నుంచి కొద్దిరోజులుగా జమాయిల్ కలప తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రాలీలో 15–18 టన్నుల కలప తీసుకెళ్తుండగా.. విలువ ఆధారంగా ఒక శాతం అంటే రూ.1,050 నుంచి రూ.1,260వరకు మార్కెట్‌కు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. కానీ గత 13రోజులుగా ట్రాక్టర్లు వెళ్తున్నా ఒక్క రూపాయీ చెల్లించలేదు. ఇదే సమయాన, రోజుకు ఎన్ని ట్రాక్టర్లలో కలప వెళ్తుంది? వాహనాలు, ట్రాక్టర్ డ్రైవర్ల ఫోన్ నంబర్లు? తదితర వివరాలను మామిడిగూడెంలోని చెక్‌పోస్ట్ సిబ్బంది ఓ కాగితంపై నమోదు చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే, జమాయిల్ కలపే కాకుండా పలు పంటలు తరలించే వాహనాల నుంచి సైతం పన్ను సక్రమంగా వసూలు చేయడం లేదని తెలుస్తుండగా.. మార్కెట్ ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయమై మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి పృథ్వీని వివరణ కోరగా. తేగడ నుంచి జమాయిల్ రవాణా చేస్తున్న కాంట్రాక్టర్ వచ్చి కలుస్తానన్నాడని తెలిపారు. అందుకే ట్రాక్టర్లు పంపించగా.. కాంట్రాక్టర్ రాకపోవడంతో గురువారం ట్రాక్టర్లను నిలిపివేశామని వెల్లడించారు.

ప్రమాదకరంగా ప్రయాణం



మండల కేంద్రంలో అధ్వానంగా మారిన ప్రధాన రహదారి

అశ్వాపురం: మండల కేంద్రంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి గుంతలమయమై రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారి అధ్వానంగా తయారై ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రహదారిని ఇరువైపులా తవ్వి అసంపూర్తిగా నెలల తరబడి వదిలేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మేలుకొని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భవనాల పరిశీలన

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు గురువారం అశ్వారావుపేట మున్సిపాలిటీ కమిషనర్ బి.నాగరాజు సర్వే నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల భవనాలతో మిగిలిన భవనాలను కూడా కమిషనర్ సందర్శించి వాటి వివరాలను సేకరించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు పి.హరిత, నల్లపు కొండలరావు, సీఆర్పీ ప్రభాకరాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రేగా' వ్యాఖ్యలు సరికాదు..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను విమర్శించే అర్హత రేగా కాంతారావుకు లేదని కాంగ్రెస్ పార్టీ భద్రాచలం మండల కమిటీ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన సమవేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో రేగా కాంతారావు విలేకరుల సమావేశం నిర్వహించి.. ఎమ్మెల్యేపై పలు ఆరోపణలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. భద్రాద్రిని కోట్ల నిధులతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తెల్లం వెంకట్రావ్‌ను విమర్శించే రేగా తన స్థాయిని దిగజార్చుకోవద్దని హితవుపలికారు. ఈ సమావేశంలో రమాకాంత్, వెంకటరెడ్డి, తిరుపతిరావు, శ్రీనివాస్, చిట్టిబాబు, నాంగేంద్ర, విజయ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గురువారం వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు.. విద్యార్థులకు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ప్రాముఖ్యతను తెలియజేశారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ యస్.మధు సూదన రావు, యస్.శేషయ్య, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలి

దమ్మపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని కోరుతూ.. మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు విద్యా వాలంటీర్లకు ఇచ్చే వేతనం ఇచ్చి.. అక్కడే పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. నాయకులు రఘు, జ్యోతి, విజయలక్ష్మి, సుజాత, యశోద, వెంకటమ్మ పాల్గొన్నారు.

వర్షంతో నష్టం.. హర్షం

నియోజకవర్గాల్లో దాదాపు అన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. రహదారులపైకి వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపించింది. కొన్ని ప్రాంతాల్లో పంటచేలు నీటమునిగి రైతులు నష్టపోయారు. వాగులు, వంకలు ఉధృతంగా పారడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా, మెజారిటీ ప్రాంతాల్లో వర్షంతో నీటి వనరులు నిండాయి. చెరువులు అలుగు పారాయి. నీటి వనరుల జలకళతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వారిలో ఖరీఫ్ సాగుకు ఆశలు చిగురించినట్లయింది

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: బూర్గంపాడు సమీపంలోని పులితేరు వద్ద నీటమునిగిన వరిమాగాణులు



దుమ్ముగూడెం: అలుగుపారుతున్న గుబ్బలమంగి ప్రాజెక్టు



దమ్మపేట: అలుగు కాలువ పారుతున్న పేరంటాల చెరువు



అశ్వారావుపేటరూరల్: వాగొడ్డుగూడెం వద్ద నీట మునిగిన లోలెవల్ చప్టా



ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ అలుగు పోస్తున్న దృశ్యం



ములకలపల్లి: కుమ్మరిపాడు లోలెవల్ చప్టాపై వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్సై మధుప్రసాద్

ప్రతిభ ఆధారిత ఇన్సెంటివ్ చెల్లించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏరియా సింగరేణి అధికారులు

మణుగూరురూరల్: ప్రతిభ ఆధారిత ఇన్సెంటివ్(పీఆర్‌పీ)ను తక్షణమే చెల్లించాలని సింగరేణి సీఎంఓఏఐ అధ్యక్షుడు, పీకేఓసీ పీఓ టి.లక్ష్మీపతిగౌడ్, ఏరియా జీఎం దుర్గం రామచందర్‌లు సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. పీఆర్‌పీ అమలు జాప్యంపై సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జీఎం కార్యాలయ ప్రాంగణంలో తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో అహర్నిశలు శ్రమిస్తున్న సింగరేణి అధికారుల పీఆర్‌పీ అమలు విషయంలో ఆలస్యం జాప్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో అధికారులు మధన్ నాయక్, డాక్టర్ సురేష్, మధుబాబు, సతీష్‌కుమార్, ఎస్ఓటు జీఎం బి.శ్రీనివాసచారి, సీఎంఓఏఐ బ్రాంచ్ కార్యదర్శి వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మార్చ్ ఫాస్ట్ రిహార్సల్



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న స్కాట్ మాస్టర్

భద్రాచలం: ఐటీడీఏలో నేడు జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా గురువారం ఐటీడీఏ స్కాట్ మాస్టర్ చలపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థుల చేత మార్చ్ ఫాస్ట్ రిహార్సల్ చేయించారు. వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులకు చలపతిరావు పలు సూచనలను అందజేశారు. గౌరవ వందనం, వివిధ విన్యాసాలను చేసి చూపించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ఎస్ఎస్‌సీ శిక్షకుడు నాగులు, తారాచంద్ సారథ్యంలో పలు రకాల మార్చ్ ఫాస్ట్ రిహార్సల్స్ చేయించారు. కార్యక్రమంలో పీఈటీ సరిత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్: సింగరేణి కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ.. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ బోర్డులో కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ బోర్డును రద్దు చేసి తిరిగి నిర్వహించాలన్నారు. మెడికల్ అటెండెన్స్ నిబంధనలు మార్చాలన్నారు. అండర్‌గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్ ఇతర డిమాండ్ల్ ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు మెమోరాండం అందజేశారు. ముట్టడి కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు అధ్యక్షత వహించగా.. నాయకులు కృష్ణ, గట్టయ్య యాదవ్, అబ్దుల్ రవూఫ్, జయరాజ్, జీవరత్నం, పుసులూరి రామారావు, శ్రీను, మల్లికార్జున్, మల్లేశ్ యాదవ్, వర్మ, గొప్ప సుధాకర్, గిరినాయక్, రామకృష్ణ, రాము, నాగయ్య, సదానందం, శంకరాచారి, సమ్మయ్య పాల్గొన్నారు.

'క్షయ'ను నివారించాలి

మణుగూరురూరల్: క్షయవ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిశాంత్‌రావు పిలుపునిచ్చారు. మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సమితిసింగారం ఆరోగ్య ఉపకేంద్రంలో ఎన్ఏసీఓ–ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. అనంతరం బాలికల వసతి గృహంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఏసీఓ సిబ్బంది, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల పరామర్శ

ములకలపల్లి: సీపీఎం మండల నాయకుడు ఊకంటి రవి కుటుంబాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తదితరులు పరామర్శించారు. రవి తల్లి ప్రమీలాదేవి అనారోగ్యంతో మృతి చెందగా.. గురువారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ప్రమీలాదేవి మృతదేహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పి.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, మధు, గొగ్గెల ఆదినారాయణ రామ్మూర్తి, నిమ్మల మధు తదితరులు ఉన్నారు.

హర్ ఘర్ తిరంగా యాత్ర

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు.. రండి మన జాతీయ జెండాను ఎగురవేద్దాం! మాతరం మాతరం వందేమాతరం! అంటూ.. అయ్యప్ప గుడి సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరుకు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కుంజా ధర్మా, పసుమర్తి సతీష్. నాగబాబు, శ్రీనివాస్, వెంకన్న, చంద్రశేఖర్, సుబ్బారావు, రాంమోహన్, కేశవ్, చక్రవర్తి, వెంకటేశ్వర్లు, నిఖిల్, హరీష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలో ప్రధాన రహదారిపై హర్‌ఘర్ తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. గురువారం అంబేడ్కర్ చౌరస్తా నుంచి వాసవీ సుర్కా బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ యాత్రలో



భద్రాచలంటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మూడు కళాశాలల విద్యార్థులు విద్యార్థినులు పాల్గొనగా, పట్టణంలో 30 అడుగుల జాతీయ జెండాను చేతబట్టి భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు. కార్యక్రమంలో పట్టా భిక్షపతి, కామసాని మధుసూదన్, ముత్యాల వెంకటేశ్వరరావు, కట్ల నరేశ్, బోగె చందర్‌రావు, కుంట భద్రయ్య, పల్లపు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల అడ్డగింత

దుమ్ముగూడెం: మండలంలోని చెరుపల్లి గ్రామంలో ఇసుక లారీలను స్థానికులు అడ్డుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. మండలం మీదుగా ఎటపాక నుంచి భద్రాచలం వెళ్లే లారీల వల్ల భద్రాచలం–చర్ల ప్రధాన రహదారి గోతులమయం కావడంతో పోలీసులు చెరుపల్లి, లక్ష్మీపురం మీదుగా నెల్లిపాక నుంచి భద్రాచలంకు ఇసుక లారీలను మళ్లించారు. దీంతో లారీల మూలంగా రహదారులు ధ్వంసమవుతున్నాయని, అతివేగంగా వెళ్లడంతో ప్రమాదాలకు అవకాశం ఉందని చెరుపల్లి వాసులు వాటిని నిలిపివేశారు.

లారీ బోల్తా

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరులోని మలుపు వద్ద ఇనుప సామగ్రి లోడ్‌తో వెళ్తున్న లారీ గురువారం బోల్తా పడింది. ఈ మలుపు సమీపానే ప్రభుత్వ పాఠశాల ఉంది. విజయవాడ నుంచి మణుగూరు వైపు వెళ్తున్న లారీ బోల్తా పడగా ఆ సమయాన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈమేరకు వేగంగా నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ సెల్వరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

ఉత్తమ హెల్త్ అసిస్టెంట్‌గా రాజేష్

అశ్వాపురం: ఐటీడీఏ పరిధిలో భద్రాచలం స్థాయిలో ఉత్తమ హెల్త్ అసిస్టెంట్‌గా అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ పూనెం రాజేష్ ఎంపికయ్యారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం ప్రశంసపత్రం అందుకోనున్నాడు. రాజేష్‌ను వైద్యాధికారి సంకీర్తన, సిబ్బందిని అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బూర్గంపాడు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండలంలోని వేపలగడ్డ, నకిరిపేట, టేకుల చెరువు, లక్ష్మీపురం గ్రామపంచాయతీలలో నిర్మించిన రూ 20లక్షల సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కొత్తగా మంజూరైనా ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరోవైపు, మోరంపల్లిబంజర, నకిరిపేట జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఐటీసీ ఆధ్వర్యంలో సైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఐటీసీ డీజీఎం చెంగలరావు, ఎంఈఓ యదుసింహరాజు, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వంతెన, రహదారి ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని సర్వాయిపాడు బంజరలో రూ.కోటీ 40 లక్షలతో మేలవాగుపై నిర్మించిన వంతెనను, అప్రోచ్ రహదారిని గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. విడతల వారిగా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, సీడీపీఓ రేవతి, ఎంపీఓ ముత్యాలరావు, ఏఈ ఐవీఎస్.ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మాజీ సర్పంచ్‌లు సుజాత, పాడియం అనిల్, నాయకులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: ఐటీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

రక్తనిధి, డిజిటల్ ఎక్స్‌రే ప్రారంభం



అశ్వారావుపేట: రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తనిధి, డిజిటల్ ఎక్స్‌రేను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం ప్రాధాన్యతను ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ రాధారుక్మిణి, వైద్యులు విజయ్‌కుమార్, మౌనిక, నీకేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులు..

దమ్మపేట: మండలంలోని అకంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రగుంపు గ్రామంలో నూతన విద్యుత్ లైన్ పనులను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం ప్రారంభించారు. ఎర్రగుంపు గ్రామంలో విద్యుత్ తీగలు పలువురు గిరిజనుల ఇళ్లపై నుండి వెళ్తున్న క్రమంలో.. వారు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే జారె.. తన ఎమ్మెల్యే నిధుల నుంచి సుమారు రూ.4 లక్షల అంచనా వ్యయంతో నూతన విద్యుత్ లైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరత్నం, ఏఈలు సాయికిరణ్, వెంకట్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

ములకలపల్లి: ములకలపల్లి మండలవ్యాప్తంగా సాగు చేస్తున్న వివిధ రకాల పంటచేలను కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. సేద్య విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.హేమచంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ బి.శివలతో కూడిన బృందం మండల వ్యవసాయాధికారి జగన్నాథపురం, కమలాపురం, సీతాయిగూడెం జీపీల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. మండల వ్యవసాయాధికారి అరుణ్‌బాబుతో కలసి వరి, పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పాం తోటలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపద్యంలో పత్తిచేటల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు.

వీరభద్రం సంతాప సభ

దుమ్ముగూడెం: మండల పరిధిలోని మంగవాయి బాడువా గ్రామంలో గురువారం సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన కల్లూరు వీరభద్రం సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు పాల్గొని వీరభద్రం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, మర్మం చంద్రయ్య, ఎలమంచి శ్రీనుబాబు, సరియం కోటేశ్వరావు, ఎలమంచి వంశీకృష్ణ, కొరసా చిలకమ్మ,ఖాదర్ బాబు, కల్లూరి లక్ష్మయ్య, సిలవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: శ్రీ కృష్ణాష్టమి సమీపించిన నేపథ్యంలో గురువారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషాధారణల్లో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. ఉట్టిని ఏర్పాటు చేయగా.. కేరింతల నడుమ విద్యార్థులు ఉట్టికొట్టే ప్రయత్నం చేశారు. ఉపాధ్యాయులు సైతం వేడుకల్లో పాలుపంచుకున్నారు.




దమ్మపేట: నాగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో..

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా కొండా ప్రమోద్

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన కొండా ప్రమోద్ బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియామితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుర్రాల దుర్గ భవాని, అధ్యక్షుడు కొండా చరణ్ చేతుల మీదుగా అందజేశారు. నియమించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. మహనీయుల బాటలో నడుస్తానని ఈ సందర్భంగా ప్రమోద్ అన్నారు.

తెల్లవాగు చెరువుకు నీళ్లొచ్చేనా?

- ప్రశ్నార్థకంగా 'సీతారామ' నీటి మళ్లింపు
- పంప్‌హౌజ్ కన్నా ఎత్తులో ఉండటమే కారణం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం రైతుల వేడుకోలు



ఇటీవల వర్షాలకు అలుగు పోస్తున్న తెల్లవాగు చెరువు

ములకలపల్లి: తెల్లవాగు చెరువు ఉమ్మడి పూసుగూడెం జీపీలోని 1500 ఎకరాల వ్యవసాయ భూములకు ప్రధాన సాగు నీటివనరు. పూసుగూడెంతోపాటు, సుబ్బనపల్లి, పాతూరు, ఒడ్డురామవరం గ్రామాల గిరిజన రైతులకు ఈభూముల్లో వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తారు. వానోస్తే జలకళ లేకుంటే వెలవెలగా ఉండే ఈ చెరువుకు సీతారామ జలాల మళ్లింపు ప్రశ్నార్థకంగా మారింది. దీనిని సీఎం ప్రారంభించి నేటికి ఏడాది అవుతున్నా.. ఈ అంశంలో ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడం గమనార్హం.

సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ)లో ప్రధాన చెరువులను అనుసంధానం చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలో పంటకు సాగుకు ఆధారమైన చెరువులు ఎల్లవేళలా నిండు జలాలతో కళకళలాడుతాయని, రెండు పంటలకు ఢోకా ఉండదని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే మండపరిధిలోని కొమ్ముగూడెం సమీపంలోని తెల్లవాగు చెరువుకు సీతారామ జలాల మళ్లింపుపై సందిగ్ధత నెలకొంది.

పక్కనే ప్రాజెక్ట్ ఉన్నా..

ఈ చెరువుకు అతి సమీపంలోని వీకే, రామవరం శివారులో సీతారామ పంప్‌హౌస్–2 ఉంది. వెయ్యి కోట్ల వ్యయంతో దీనిని నిర్మించగా.. బీజీ, కొత్తూరు నుంచి ఇక్కడకు వచ్చిన గోదావరి నీటిని, ఈ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తారు. ప్రధాన కాలువ గుండా నీళ్లు కమలాపురం పంప్‌హౌస్–3 చేరుతాయి. కాగా పంప్‌హౌస్–2కు కేవలం 3 కిలోమీటర్ల దూరంలోని తెల్లవాగు చెరువుకు మాత్రం గోదారి జలాలు మళ్లించే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. సీతారామ మెయిన్ కెనాల్ కంటే ఎగువ భాగంలో ఈ చెరువు ఉండడం ప్రధాన సమస్యగా మారింది, ప్రధాన కాలువ గుండా పంట కాలువ ద్వారా నీటిని మళ్లించాలనుకున్నా.. ఆ నీళ్లు గ్రావిటీ ద్వారా చెరువులోకి వెళ్లే అవకాశం లేదు. దీంతో చెరువుకు నీటి మళ్లింపు ప్రశ్నార్థకంగా మారింది.

ఎమ్మెల్యేకు రైతుల వినతి

ఆయకట్టు రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు ఇటీవల పంప్‌హౌస్–2కు వచ్చిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు తమ సమస్యను విన్నవించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎస్ఆర్ఎల్ఐపీ పంప్‌హౌస్–2 అతిసమీపంలోనే ఉన్నా.. చెరువు నిండేలా లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సాగు నీరు అందేలా చూడాలని అభ్యర్థించారు. గిరిజన రైతుల గోస ఆలకించి, నీటి మళ్లింపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం వర్షాధార నీటితో నిండే ఈ చెరువులోకి సీతారామ జలాలు అందిస్తే, రెండు పంటలకు సమృద్ధిగా నీరు లభిస్తుందని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే జారె సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

సర్వే చేపడుతున్నాం..



తెల్లవాగు చెరువు ప్రాజెక్ట్ ఎగువ భాగంలో ఉండడంతో గ్రావిటీ ద్వారా నీటి మళ్లింపు కష్టంగా మారింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సమగ్ర సర్వే చేపడుతున్నాం. తుది నివేదిక అనంతరం సాధ్యాసాధ్యాలపై ఉన్నత అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారు.

– మోతీలాల్, డీఈఈ, నీటిపారుదల శాఖ